మల్లికార్జునస్వామి సేవలో ఎమ్మెల్యే గాంధీ



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం మల్లికార్జునస్వామి దేవాలయంలో ఆదివారం కల్యాణమహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గౌతమ్‌గౌడ్, వాలా హరీష్‌రావు, మల్లారెడ్డి, బాబు మోహన్ మల్లేష్ తదితరులున్నారు.

పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ



ఎండీ జిలాని

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థి ఎం.డీ జిలానీకి పీహెచ్‌డీ డిగ్రీకి ఎంపికయ్యారు. యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఈ డిగ్రీని ప్రకటించారు. ఆయన 'ఇంపాక్ట్ ఆఫ్ ఎడ్యుకేషన్ యాక్ట్–2009 ఆన్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్–ఎ స్టడీ ఆఫ్ సంగారెడ్డి డిస్ట్రిక్ట్' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆయనకు యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ సయ్యద్ నజీవుల్లా పర్యవేక్షణ చేయగా.. సహ పర్యవేక్షణను మాజీ ప్రొఫెసర్ వీసీ ప్రొ.ఎస్ఎం రహమతుల్లా ఆధ్వర్యంలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించగా పరిశీలించిన అనంతరం డిగ్రీని ప్రకటించారు.

ముగిసిన తెలంగాణ ఆర్ట్ గ్రూప్ షో- 2024



చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకున్న చిత్రాలు

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన తెలంగాణ ఆర్ట్ గ్రూప్ షో - 2024 ఆదివారంతో ముగిసింది. కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని చిత్ర కళాకారులు కొనియాడారు. చివరిరోజు కావడంతో సందర్శకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కళాకారులు వేసిన 144 చిత్రాలను సందర్శించారు.

దేవాలయ వార్షికోత్సవ వేడుకలు



హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడాకాలనీలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి లలితా నగరేశ్వర దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు గౌతమ్‌గౌడ్, వాలా హరీష్‌రావు, మల్లారెడ్డి, కాలనీవాసులు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

సందడిగా హోలీ సంబరాలు



నల్లగండ్లలో కాముడి దహనం..



అపర్ణాగ్రాండేలో హోలీ వేడుకల్లో పాల్గొన్న కమ్యూనిటీ వాసులు

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో హోలీ వేడుకలను సందడిగా ఆదివారం నిర్వహించారు. గేటెడ్ కమ్యూనిటీ వాసులంతా కలిసి కాముడిని కాల్చి సాంప్రదాయబద్ధంగా హోలీ వేడుకలను ప్రారంభించారు. పిల్లలు, యువకులు, మహిళలు, వృద్ధులు వయోబేధాలు లేకుండా అంతా కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొన్నారు. డాక్టర్ హరిశంకర్‌జైన్, డాక్టర్ లాహోటి, మోహన్‌రావు, బ్రహ్మానందం, పాండే, శ్రీనివాసరాజు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, శ్యామ్‌ప్రసాద్, పాటిల్, వసంతరావు, ప్రకాష్, జోషి కుసుమా, వికాస్, రజని పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ చేసిందేమీ లేదు

పటాన్‌చెరు టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్, బీజేపీలకు లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో మెదక్ పార్లమెంటు జీహెచ్‌ఎంసీ 113 డివిజన్ పోలింగ్ బూత్‌ల పరిధి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో అనేక పరిశ్రమలు ఏర్పడ్డాయని, బీజేపీ తొమ్మిదేళ్లలో ఒక్కటి కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండుసార్లు గెలిచి బీడీ గుర్తుపై ఉన్న పుర్రెబొమ్మ కూడా తీయించలేకపోయిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి గతంలో కలెక్టర్‌గా ఉన్నప్పుడు కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల భూసేకరణ కోసం రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుని సరైన పరిహారం ఇప్పించలేకపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మతిన్, యువరాజ్, కుంచాల కిషన్, అతీక్, ఆసిఫ్, గోపాల్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

ప్రొఫెసర్ డాక్టర్ కళాధర్ బాబు

ఏజీవర్సిటీ: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కళాధర్ బాబు అన్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థులు శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో ఎనిమిది రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని దానికి అనుకుణంగా ప్రణాళికబద్ధంగా సాధన చేస్తూ విజయాన్ని చేరుకోవాలని సూచించారు. కేవలం శిబిరాలతో మాత్రమే కాకుండా వ్యవసాయ సంబంధిత అంశాల్లోనూ రైతులకు అండగా ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలో వచ్చే నూతన ఆవిష్కరణలు, నూతన వంగడాల రకాలు, సాంకేతికతను రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. యువతకు చదవుతో పాటు దేశభక్తి తప్పనిసరిగా ఉండాలని కోరారు. ఎన్ఎస్ఎ యూనిట్ ప్రోగ్రాం అధికారులు సీఎస్ఆర్ సంతోషిని, లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్లు అశ్విన్‌కుమార్, శ్రీరాములు, మల్కారం గ్రామ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, సిబ్బంది విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓ వైపు వేశారు.. మరో వైపు మరిచారు

అసంపూర్తిగా వైట్ ట్యాపింగ్ రహదారి పనులు

- నగం మేర వదిలేసిన వైనం
- రూ. 50 కోట్లతో నాలుగేళ్ల క్రితమే ప్రారంభం

రాయదుర్గం: వైట్ ట్యాపింగ్ రోడ్డు ఓ వైపే వేసి రెండో వైపు పూర్తిగా మర్చిపోయారనే భావన అందరిలోనూ మెదులుతోంది. ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఔటర్ రింగురోడ్డు వరకు ఉన్న రోడ్డును 6 లైన్ల రోడ్డుగా మార్చాలని నిర్ణయించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలనే నెపంతో వైట్ ట్యాపింగ్ రోడ్డు నిర్మించాలని సంకల్పించి ట్రిపుల్ ఐటీ కూడలి నుంచి ఇన్ఫోసిస్, ఐఎస్‌బీ, విప్రో, మైక్రోసాఫ్ట్ ముందు నుంచి విప్రో సర్కిల్ వరకు మాత్రం ఓ వైపు మాత్రమే మూడు లేన్ల వైట్ ట్యాపింగ్ రోడ్డు నిర్మాణం చేశారు. ఆ తర్వాత విప్రో సర్కిల్ నుంచి ఐసీఐసీఐ, మంత్రి బహుళ అంతస్తుల భవనం, పెట్రోల్ బంక్, క్యాఫే జెమిని, స్టార్ హోటళ్ల మీదుగా ఔటర్‌రింగురోడ్డు వరకు ఓ వైపు వేయకుండా వదిలేశారు.

- ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, విప్రో సర్కిల్, ఐసీఐసీఐ బ్యాంకు భవనం ముందున్న రోడ్డును కూడా ఔటర్ రింగురోడ్డు వరకు మూడు లేన్ల వైట్ ట్యాపింగ్ రోడ్డు వేయాలని సంకల్పించారు.
- మరో వైపు రోడ్డు నిర్మాణం సంగతే మరిచిపోయారని పలువురిలో అనుమానం వ్యక్తమవుతోంది.
- టీఎస్ఐఐసీ అధికారులు, పాలకమండలి, రాష్ట్రంలో ప్రభుత్వం కూడా మారిపోవడంతో ఇక ఈ రోడ్డు వ్యవహారం ఆటకెక్కిందనే విమర్శలున్నాయి.
- ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి గోపీచంద్ అకాడమీ, ఇన్ఫోసిస్, విప్రో సంస్థ ముందు నుంచి విప్రో సర్కిల్ వరకు ఉన్న రోడ్డును మూడు లేన్ల వైట్ ట్యాపింగ్ రోడ్డు వేశారు.
- ఈ నేపథ్యంలో రెండు వైపులా రోడ్డును మూసివేసి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని అధికారులు సూచించారు. దీంతో ఐటీ సహా ఇతర ఉద్యోగులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా వైట్ ట్యాపింగ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ వరకు మూడు లేన్ల వైట్ ట్యాపింగ్ రోడ్డు..



విప్రో సర్కిల్ నుంచి ఔటర్ రింగురోడ్డు వరకు రెండో వైపు రోడ్డు..

శేరిలింగంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా నల్ల సంజీవరెడ్డి



నియామకపత్రాన్ని అందుకున్న సంజీవరెడ్డి

శేరిలింగంపల్లి: కాంగ్రెస్‌పార్టీ శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా నల్ల సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి చేతుల మీదుగా పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి పరిధిలో భారీ మెజార్టీ సాధించేలా సమిష్టిగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీని శేరిలింగంపల్లిలో మరింత పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యకర్తలు, నాయకులంతా కలిసికట్టుగా పనిచేసేలా నిరంతరం పని చేస్తామన్నారు. శేరిలింగంపల్లి నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

బస్తీ దవాఖాన ఏర్పాటుకు స్థల పరిశీలన

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్‌చెరు: బస్తీ దవాఖాన ఏర్పాటుకు జేపీ కాలనీ రోడ్ నెంబర్ 1లోని పార్క్ స్థలాన్ని పరిశీలించామని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ చెప్పారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఆయన పర్యటించారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన స్మశాన వాటికలో విద్యుత్ స్తంభాలను తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులతో ఆయన మాట్లాడి సమస్య పరిష్కారానికి ఆదేశించారు. అనంతరం యాదవ స్మశాన వాటికలో తన సొంత నిధులతో చితి మండపాల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయన వెంట ఆయా కాలనీల వాసులు ఉన్నారు.

ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్ తదితరులు

హఫీజ్‌పేట్: మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మాదాపూర్ డీసీపీ వినీత్ పేర్కొన్నారు. శనివారం రాత్రి న్యూ హఫీజ్‌పేట్‌లోని ఆదిత్యనగర్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బస్తీల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాల్పడిన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ.. సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. మియాపూర్, చందానగర్, ఆర్సీపురం, కొల్లూర్ ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, పోలీసులు, సీఐఎస్ఎఫ్ బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రాయదుర్గం: అక్రమంగా ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్యనగర్‌లోని ఓ ఇంట్లో బంజారాబస్తీకి చెందిన కెతావత్ చందర్ (60) మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం అతడిని అరెస్ట్ చేశామన్నారు. మద్యం బాటిళ్ల విలువ సుమారు రూ.6,412 ఉంటుందని వివరించారు.

డబుల్ రిజిస్ట్రేషన్ చేయిస్తే క్రిమినల్ కేసులు పెడతాం

డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల తీర్మానం



డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రాయదుర్గం: డైమండ్ హిల్స్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుల సమావేశం ఆదివారం కాలనీలోని కారు లాంజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మా కాలనీలోని ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు చేసిన వారందరిపై క్రిమినల్ కేసులు పెడతామని సభ్యులందరూ.. ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. పాత పత్రాలను తిరస్కరించకుండా డబుల్ రిజిస్ట్రేషన్ చెల్లదని, దాని ఆధారంగా కోర్టుకు వెళ్లాలని హైకోర్టు తీర్పుతో స్పష్టతను ఇచ్చిందన్నారు. ఎల్లవేళలా లిటిగేషన్లు పెట్టి మమ్మల్ని వేధించొద్దని మేమంతా కలిసి లిటిగేట్‌లందరికీ చెబుతున్నామని, ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇబ్బంది పెట్టే వారందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని తీర్మానం చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అభ్యర్థన లేఖ కూడా రాయాలని తీర్మానించారు.

ఘనంగా మట్టల ఆదివారం

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిల్లోని చర్చిల్లో ఆదివారం మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. మణికొండ సేవియర్స్ లూథరన్ చర్చిలో జరిగిన కార్యక్రమంలో ఫాస్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఏసు ప్రభువుకు జయం చెప్పే కార్యక్రమంలో భాగంగా మట్టల ఆదివారాన్ని నిర్వహిస్తామన్నారు. ఈత మట్టలతో నృత్యాలు చేస్తూ.. పాటలు పాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

మణికొండ: సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లాలమ్మ గార్డెన్ కాలనీలోని దిలీప్‌సూపర్ మార్కెట్ ఎదుట రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మల్లయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు డి. రాజేశ్, వేణుమాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీరుస్తాం..

- చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- సిద్ధమైన మున్సిపల్ అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎండలు ఉధృతమవుతుండడంతో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అనేక కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయి. వాటితోపాటు అనేక భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతానికి పలురాష్ట్రాల నుంచి భవననిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో వలస వచ్చారు. వారిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా రద్దీగా ఉండే ప్రాంతాలను గుర్తించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 17 వార్డులు ఉండగా మొదట ఆరుప్రాంతాలలో అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలలో వివిధ సేవా సంఘాలు, రాజకీయ నేతలు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ప్రాగంణంలో విద్యుత్‌నగర్ ట్యాంక్ వద్ద, కొల్లూర్, ఈదుల నాగులపల్లి, వెలిమెల, ఇందిరానగర్ సర్కిల్ వద్ద నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయం భవనం వద్ద అధికారులు చలివేంద్రాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. బాటసారులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు.



మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మంచినీటి కుండ

దాహార్తిని తీర్చడానికి చర్యలు

కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఎక్కువగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వారిని దృష్టిలో పెట్టుకొని రోడ్ల పక్క మట్టికుండలను ఏర్పాటుచేసి నిత్యం వాటి ద్వారా బాటసారుల దాహార్తిని తీర్చడానికి చర్యలు చేపట్టాం.

– సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్

జీవితాంతం ప్రజాసేవకే అంకితం

చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాంతం ప్రజాసేవకే అంకితమవుతానని తనని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేస్తూ.. ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు..

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీలో 300 మంది బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం జగదీశ్వర్‌గౌడ్, డాక్టర్ రంజిత్‌రెడ్డి, చల్లా నర్సింహ్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఐశ్వర్య వల్లి శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. పుష్పాంజలి, గరుడగమన, పంచమూర్తి కౌతం, జతిస్వరం, గణేశపంచరత్న, చంద్రచూడ శివశంకర, మురళీధర కీర్తనం, దశావతారం, అదివో అల్లదిగో తదితర ప్రదర్శనలతో అలరించారు. కళాకారులు ఆరాధ్య, ప్రవళిక, తన్వి, శ్రిష్టి, సాహితి, కుసుమిత తదితరులున్నారు.



మాదాపూర్ శిల్పారామంలో భరతనాట్యం చేసిన విద్యార్థులు

అత్యాధునిక సౌకర్యాలతో వైద్య సేవలు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న చైర్మన్ ధన్‌రాజ్, డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్

హఫీజ్‌పేట్: మదీనాగూడలో ఉమెన్, చిల్డ్రన్స్ ఆరోగ్య వైద్య సేవల కోసం అత్యాధునిక సౌకర్యాలతో పారామిత ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి చైర్మన్ ధన్‌రాజ్, డైరెక్టర్ డాక్టర్ జగన్మోహన్‌లు పేర్కొన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలో పారామిత మాతృపేరుతో నూతన ఆస్పత్రిని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యాధునిక సౌకర్యాలతో రోగులకు మెరుగైన చికిత్స అందించనున్నట్లు వివరించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ వైద్య ఖర్చులతో కూడిన వైద్యం చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో 24 పడకలు, ఎన్ఐసీవి, పీఐసీవి, సూట్‌రూమ్‌లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి వైద్య నిపుణులు, డాక్టర్లు జగన్, రుకేష్, సాయి, ప్రణీత్, అపర్ణ పాల్గొన్నారు.

భువనగిరి బరిలో సీపీఎం

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ
- సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు



పటాన్‌చెరు టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన పార్టీ సభ్యుల సమావేశంలో చుక్క రాములు మాట్లాడుతూ... ఎన్నికలలో లబ్ధి పొందాలని, కోడ్ అమలులో ఉన్నప్పుడు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ ఎలక్టోరల్ బాండ్స్‌తో లబ్ధి పొందుతుందన్నారు. మెజారిటీ ఎస్‌బీఐ బాండ్స్ బీజేపీకే ఉన్నాయని ఎలక్షన్ కమిషన్ బహిర్గతం చేసిందని గుర్తు చేశారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన ఎలక్షన్ బాండ్స్ ను సీపీఎం పార్టీ తోసిపుచ్చిందన్నారు. రాష్ట్రం లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరించడం వల్లనే అధికారం కోల్పోయిందన్నారు. కొత్తగా అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు తప్పక అమలు చేయాలని కోరారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి సీపీఎం పార్టీ బరిలో ఉంటుందన్నారు. అనంతరం పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శిగా ఎండీ వాజీద్ అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు, కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అర్జున్, ప్రసాద్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.